క్లుప్తంగా

వేడుకగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



విజయవాడ కల్చరల్: కంచి కామకోటి పీఠస్థ శారదా చంద్ర మౌళీశ్వర స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. గురువారం నాటి కార్యక్రమంలో రుత్వికులు గరుడారాధన, నిత్యారాధన, హోమం, బలిహరణ, అస్రజ అంకుర పూజలను నిర్వహించారు. దేవాలయ నిర్వాహకులు దసరా మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన శ్రీ వేంకటేశ్వర వ్రతంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డాక్టర్ రామ్మోనరావు, మేనేజర్ శర్మ నిర్వహించారు. శారదా మాతను కాత్యాయనీదేవిగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



పాయకాపురం(విజయవాడరూరల్): సేవా భావం కలిగిన ముస్లిం మహిళలకు ఆజాద్ ముస్లిం కమిటీలో భాగస్వామ్యం కల్పిస్తామని కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. గురువారం ఆజాద్ ముస్లిం కమిటీ కార్యాలయంలో ముస్లిం మహిళల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 నెలలుగా ఆజాద్ ముస్లిం కమిటీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా పేద కుటుంబాల్లోని పిల్లలకు విద్య, వైద్యం, యువతుల వివాహాలకు నిత్యాసర వస్తువులను అందజేయడం, పేద మహిళలకు కుట్టు మిషన్లు, కూరగాయాల బండ్లు, బడ్డీకొట్లు అందజేస్తున్నట్లు తెలియజేశారు. వైఎస్సార్ కాలనీ మహిళా అధ్యక్షురాలు షేక్ నసీమా ఆధ్వర్యంలో కాలనీ ప్రధాన కార్యదర్శిగా షేక్ రేష్మ, సహాయ కార్యదర్శిగా షేక్ ఫాతిమా, కోశాధికారిగా షేక్ జాన్‌బీలను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు.

నేడు చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, ధీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమం 26వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు జరుగుతుందని విగ్రహ కమిటీ చైర్మన్ కందకట్ల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విగ్రహావిష్కరణ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజాకార్ల అండతో దేశ్‌ముఖ్‌లు సాగించిన ఆకృత్యాలపై చాకలి ఐలమ్మ ప్రాణాలకు తెగించి పోరాడారన్నారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నాయకులు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్‌లు పాల్గొంటారన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో రజక సంఘం నాయకులు ఉకోటి శేషగిరిరావు, మాదిగొండ శ్రీనివాసరావు, మాదిగొండ గోపాలకృష్ణ, కందగట్ల రమేష్, పిల్లుట్ల వంశీ, ఎం.వి.వి. సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

28న శతాధిక వృద్ధులకు సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 28వ తేదీన విజయవాడ దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శతాధిక వృద్ధులకు సత్కారం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ తెలిపారు. ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 13 మంది శతాధిక వృద్ధులను తాము ఇప్పటికే గుర్తించామన్నారు. వారికి ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రముఖుల చేతులమీదుగా సత్కారం నిర్వహించి, నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే అదేరోజు వయోవృద్ధులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇంకా ఎక్కడైనా శతాధిక వృద్ధులు ఉంటే వారి వివరాలు తమకు తెలియజేస్తే తాము వారిని సొంత ఖర్చులతో తీసుకువచ్చి సత్కారం చేసి తిరిగి వారి ఇంటి వద్ద దింపనున్నట్లు తెలిపారు. ఇందుకుగానూ 93475 72766 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ట్రస్టీలు తట్టి అర్జునరావు, ఎన్వీయూ సతీష్ కుమార్, పి. లక్ష్మీనరసింహరావు, వెంకటేష్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.

కాత్యాయనీ.. కరుణించు మాతా



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీగాయత్రీదేవిగా..




గంగానమ్మ దేవాలయంలో మహాలక్ష్మి అమ్మవారి అలంకారంలో..



శ్యామలంబదేవి దేవాలయంలో అమ్మవారు జీవీఆర్‌నగర్‌లో..



అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు



రాజీవ్‌నగర్లో నిదానం పాటి అమ్మవారి ఆలయంలో కాత్యాయనీదేవిగా..

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారు కాత్యాయనీదేవిగా పూజలు అందుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

- ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో అమ్మవారిని శ్రీకాత్యాయనీ దేవిగా అలంకరించి ప్రత్యేకపూజలు, కుంకుమార్చనలు చేశారు.
- శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో అమ్మవారిని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన శ్రీ గాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన, శ్రీలలితా సహస్రనామ పారాయణం జరిగింది.
- బావాజీపేట నాలుగోలైనులో అమ్మవారిని శ్రీదేవీ ధర్మప్రచార పరిషత్ బచ్చుమాధవీ మురళీకృష్ణ ఆధ్వర్యాన కాత్యాయనీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.
- దావు బుచ్చయ్యకాలనీలో అమ్మవారిని శ్రీకాత్యాయనీదేవిగా అలంకరించి, పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలు పూజలు జరిగాయి.
- రామలింగేశ్వరపేట శ్రీప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయంలో అమ్మవారిని శ్రీకాత్యాయనీ దేవిగా అలంకరించి పూజలు చేశారు.
- గద్దె వెంకట్రామయ్యనగర్‌లో అమ్మవారిని జీవీఆర్‌నగర్ భక్తబృందం ఆధ్వర్యాన శ్రీ కాత్యాయనీదేవిగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- మధురానగర్ పుట్టవీధిలోని స్వయంభూ శ్రీబాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో అమ్మవారిని శ్రీకాత్యాయనీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారిని శ్రీకాత్యాయనీదేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. మధురానగర్ మెయిన్ రోడ్డులో అమ్మవారిని శ్రీకాత్యాయనీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు ప్రత్యేక పూజలు, శ్రీలలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు.



కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో..



శివరామకృష్ణ క్షేత్రంలో మయూర వాహనంపై..

కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో నాలుగో రోజైన గురువారం ఆలయంలో కొలువైయున్న అమ్మవారు శ్రీఅన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమార్చన, భోగనీరాజన, మహా మంత్రపుష్పకై ంకర్యాలు నిర్వహించారు. ఆలయ కార్యదర్శి గంగాధరరావు పర్యవేక్షణలో భక్తులు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించారు.

కాత్యాయనీదేవి అలంకరణలో..

పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్‌నగర్లోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో నాల్గో రోజు గురువారం కాత్యాయనీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే ప్రజాశక్తి నగర్లోని శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో, పైపులరోడ్డు ప్రశాంతి నగర్లో, సంతోషిమాతా దేవస్థానంలో అమ్మవారు కాత్యాయనీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

అన్నపూర్ణాదేవి సేవలో మేయర్ భాగ్యలక్ష్మి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక 32వ డివిజన్, అయోధ్యనగర్‌లోని శ్రీ శివకామేశ్వరి దేవస్థానంలోని గాయత్రీదేవి అలంకారంలోని అమ్మవారు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి గాయత్రిదేవి అలంకారంలోని శివకామేశ్వరి దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుండె సుందరపాల్, నాయకులు ఉన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మేయర్ భాగ్యలక్ష్మి

అన్నపూర్ణాదేవిగా..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం నాలుగో రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అన్నపూర్ణాదేవిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో వై. సీతారామయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

సకల శుభప్రదం.. ఛండీహోమం

విజయవాడ కల్చరల్: ఛండీహోమం సకలశుభప్రదమని ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గవర్నర్‌పేటలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఛండీహోమం నిర్వహించారు. శైవపీఠాధిపతి శివస్వామి మాట్లాడుతూ సర్వశక్తి వంతమైంది ఛండీహోమం దుర్గాసప్తశతి అని వివరించారు. వేదమంత్రాల మధ్య పూర్ణాహుతి నిర్వహించారు. బార్ అసోసియేషన్ మహిళా కార్యదర్శి అనూరాధ, మెట్రోపాలిటిన్ స్పెషల్ జడ్జి, సత్యానంద్‌తోపాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



చండీహోమం నిర్వహిస్తున్న రుత్వికులు

సకల శుభదాయని కాత్యాయనీ..

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి, ఉత్తరాధికారి విధుశేఖర మహాస్వామి ఆశీస్సులతో గురువారం శివరామకృష్ణ క్షేత్రంలో పీఠ సంప్రదాయాన్ని అనుసరించి శారదాంబను మయూర వాహన కౌమారిగానూ, బాలాత్రిపురసుందరని కాత్యాయనీ దేవిగానూ, శ్రీ మహాలక్ష్మిని గజలక్ష్మిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లబ్బీపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శారదాదేవిని కాత్యాయనీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

కనకదుర్గమ్మకు సాహితీ సమార్చన



విజయవాడ కల్చరల్: విశ్వావసు నామసంవత్సర శరన్నవరాత్రుల సాహిత్య కార్యక్రమంలో భాగంగా శివరామకృష్ణ క్షేత్రంలోని భారతీ తీర్థ శ్రవణ సదనంలో గురువారం నిర్వహించిన అష్టావధాన కార్యక్రమం సాహితీ సౌరభాలను వెదజల్లింది. విదేశాలలో అష్టావధానాలు, స్వదేశంలో మహా సహస్రావధానాలు నిర్వహించిన డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్ ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ సంచాలకత్వంలో అష్టావధానం నిర్వహించారు. పృచ్ఛకులుగా పింగళి వెంకట కృష్ణారావు సమస్య అంశాన్ని, దత్తపది అంశాన్ని డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, వర్ణన అంశాన్ని డాక్టర్ కావూరి సత్యవతి, వ్యస్తపాది డాక్టర్ ఉపద్రష్ట వెంకటరమణ మూర్తి, ఆశువు అంశాన్ని ముదిగొండ బాలకాత్యాయని, పురాణ గానం సంగీత విద్వాంసుడు పోపూరి గౌరీనాథ్, అప్రస్తుత ప్రసంగాన్ని దండిభొట్ల దత్తాత్రేయ శర్మ నిర్వహించారు. పండితులు అడిగిన అనేక అంశాలకు కడిమెళ్ల వరప్రసాద్ సమర్థంగా సమాధాన పరిచారు. శివరామకృష్ణ క్షేత్ర ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ పండితులను సత్కరించారు.

నగర శుభ్రతలో లోపం ఉండరాదు: కమిషనర్



పటమట(విజయవాడతూర్పు): నగర పరిశుభ్రతలో ఎటువంటి లోపం తలెత్తకూడదని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం టిక్కిల్ రోడ్డు, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్, ఎన్టీఆర్ కాలనీ, ఏలూరు రోడ్డు, గులాబీ తోట ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల ఉత్సవ వేడుకలలో అధికారులు నిమగ్నమైనప్పటికీ నగర శుభ్రతలో ఎటువంటి లోపం ఉండరాదన్నారు. ప్రతిరోజు వ్యర్థాల సేకరణ ఖచ్చితంగా సాగాలని, వీధుల్లో చెత్తకుప్పలు ఉండరాదని, సైడ్ కాలువలను రోజూ శుభ్రపరచాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తీసేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటి నుంచి సేకరించిన వ్యర్థాలను, రోడ్ల వెంబడి తొలగించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్ ప్లాంట్‌కు తరలించాలని సూచించారు.

కొనసాగుతున్న సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు సాయిబాబా మందిరంలో 107వ పుణ్యతిథి మహోత్సవాలు గురువారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. పుణ్యతిథి మహోత్సవాలలో భాగంగా బాబావారికి క్షీరం, తేనెతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. లోక కళ్యాణార్థం మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సాయినాథ, దత్తాత్రేయ హోమం నిర్వహించారు. బాలాపూజ, సుహాసినీ పూజ జరిగింది. పూనూరు గౌతంరెడ్డి దంపతులు బాలలు, సుహాసినీలకు పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, లక్ష్మీసహస్రనామ పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని బాబావారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమాలను మందిర అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



హోమం చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని ఉపాధ్యాయ సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ సత్యనారాయణ, అనున్న వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించినట్లు పేర్కొన్నారు. డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం వెంటనే అమలు చేయాలని, వెంటనే 12 పీఆర్సీని ప్రకటించి ఐఆర్‌ను ఉద్యోగుల మనోభీష్టానికి అనుకూలంగా ఇవ్వవలసిందిగా కోరారు. బదిలీ అయినా ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారి స్థానంలో నూతన డీఎస్సీ వారిని నియమించాలని, దసరా పండుగ సందర్భంగా బకాయిలు పడిన నాలుగు డీఏలను, వెంటనే ప్రకటించాలని సూచించారు. పీఎఫ్, జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ సరెండర్ లీవ్ బకాయులకు వెంటనే నిధులు మంజూరు చేయవలసిందిగా కోరారు. మెడికల్ లీవ్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

బాలయ్య నోరు అదుపులో ఉంచుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నోరు అదుపులో ఉంచుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు అన్నారు. ఒక బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న బాలకృష్ణ అసెంబ్లీ సాక్షిగా దుర్భాషలాడటం ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అందరితో మమేకం అయ్యి కలిసిపోయే జగన్‌మోహన్‌రెడ్డిని నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించబోమని స్పష్టం చేశారు. అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, నందమూరి బాలకృష్ణ అబద్ధాలు మాట్లాడటం వారి స్థాయిని దిగజార్చుకోవటమేనని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎలాంటి వారో.. ఎలా అప్యాయంగా పలకరించి గౌరవం ఇచ్చారో ప్రముఖ సినీ నటుడు చిరంజీవి సైతం వివరణ ఇచ్చారని గుర్తు చేశారు.

ఫార్మసిస్టుల పాత్ర కీలకం

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమైనదని ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియమ్ కేరి అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా గురువారం సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన విలియం కేరి మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ మెడికల్ విభాగాల్లో మెరుగైన వైద్యంలో ఫార్మసిస్టుల పాత్రను తెలియజేసే నమూనా రూపకల్పన పోటీ నిర్వహించారు.

దుర్గమ్మకు నాట్య నీరాజనం



సంప్రదాయ నృత్యాలను ప్రదర్శిస్తున్న సౌమ్య బృందం

విజయవాడ కల్చరల్: కనకదుర్గానగర్‌లోని కళావేదికపై గురువారం కళాకారులు ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి భరతనాట్యం, జానపద నృత్య సంప్రదాయంలో సంప్రదాయ కీర్తనలకు నృత్యాలను అభినయించారు. పి. వెంకటేశ్వరమ్మ తాళం భజనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భక్తి రంజని కార్యక్రమంలో భాగంగా మోదుమూడి సుధాకర్ శాస్త్రీయ సంగీత కచేరి, ఎం. లక్ష్మీశ్యామల, విష్ణుభొట్ల సోదరీ మణులు కర్నాటక సంగీతంలోని కీర్తనలు.. సంప్రదాయ నృత్య కార్యక్రమంలో భాగంగా ఎం. జమున, ఎస్. త్రిలింగపతి, సౌమ్య భాగవతుల, కుప్పా కృష్ణవేణి, పి. సౌమ్యశ్రీ, త్రినాథాచారి తదితరులు అమ్మవారి మీద రచించిన కీర్తనలకు నృత్యాలను అభినయించారు. కళాకారులకు జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలను అందజేశారు.

నయనమనోహరం.. మోహినీ భస్మాసుర నృత్య రూపకం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాటక అకాడమీ, విజయవాడ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో గురువారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యువ నర్తకి తమ్మిన సాహిత్య కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతారవి బాల కృష్ణ బృంద కళాకారులు మోహినీ భస్మాసుర నృత్య రూపకాన్ని, నవదుర్గల అంశాన్ని మనోహరంగా ప్రదర్శించారు. భస్మాసురినిగా శరణ్య, మోహినిగా ముళ్లపూడి ఈశ్వరి, పార్వతిగా మోతకూరి భువన, విష్ణువుగా లింగమనేని తేజస్వి, లక్ష్మీదేవిగా దాక్షాయని, నారదునిగా యశశ్రీ నృత్యాలను అభినయించారు. కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. కాకినాడకు చెందిన అనపర్తి లవరాజు రామయణంలోని ప్రధాన ఘట్టాలను తొలుబొమ్మలాటను ప్రదర్శించారు. ప్రవీణ్ మ్యాజిక్ షో, తాండ్ర సుబ్రహ్మణ్యం రచించిన శ్రీరామాంజనేయ యుద్ధం పద్యనాటకం ఆకట్టుకుంది. భాషా సాంస్కృతిక శాఖ మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్ నిర్వహించారు. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ, సాంస్కృతిక శాఖ చైర్ పర్సన్ కళాకారులను సత్కరించారు.



మోహినీ భస్మాసుర నృత్యరూపకం





జయ జయహే జననీ

దిగువున కృష్ణమ్మ పరవళ్లు.. ఎగువున దుర్గమ్మ దీవెనలు.. కొండంతా సంబరం.. భక్తుల ఆనంద పరవశం.. వెరసి బెజవాడ ఆధ్యాత్మిక సుగంధాలను వెదజల్లుతోంది. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో దుర్గమ్మ దర్శనానికి అశేష జనవాహిని కదిలివస్తూనే ఉంది. కుంకుమ పూజల వైభోగం, సాంస్కృతిక కార్యక్రమాల వైభవంతో గురువారం ఇంద్రకీలాద్రి సింధూరశోభితమై మెరిసింది. భక్తుల కల్పవల్లిగా.. శ్రీకాత్యాయనీ దేవిగా కొలువుదీరిన దుర్గమ్మను కనులారా వీక్షించిన అశేష భక్తవాహిని అమ్మకు నీరాజనాలు అర్పించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

- లబ్బీపేట(విజయవాడతూర్పు): అక్టోబరు 7న మంగళగిరిలో నిర్వహించే కార్యక్రమంలో 15వేల మందికి వినికిడి మిషన్లు పంపిణీ చేయనున్నట్లు ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్పీఐ అధినేత, కేంద్రమంత్రి రామదాస్ అథావాలే పాల్గొంటారని ఆయన వివరించారు. నగరంలోని తమ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.